# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్ 05.12.2024 | 24 క్యారెట్లు 80,215.00 | కిలో వెండి 1,07,000.00 | 32 ℃ | సంపుటి:3 | సంచిక:43

www.vishalabharati.com




..మిగతా 3 లో

## ఈనెల 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- ఉదయం 10.30 గంటలకు ప్రారంభం
- నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్

### కేసీఆర్‌పై కోపంతో తెలంగాణ తల్లి

## రూపం మార్చొద్దు


### చరిత్ర ఎప్పటికీ నిన్ను క్షమించదు

- తప్పులు దాచుకోవడానికే అప్పుల కథలు
- రేవంత్ డ్రామాలు ప్రజలకు తెలిసిపోయాయ్
- సీఎం రేవంత్‌కు ఫామ్‌హౌస్ రాసిస్తా..
- 1000 ఎకరాలు ఉన్నట్లు నిరూపించండి
- ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** మూర్తీభవించిన స్త్రీగా తెలంగాణ తల్లిని కేసీఆర్ రూపొందించారని, ఆయన మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మారిస్తే చరిత్ర క్షమించదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. నాడు ఇందిరా గాంధీ ప్రతిష్ఠించిన భరతమాత రూపాన్ని వాజ్‌పేయి అధికారంలోకి రాగానే

..మిగతా 2 లో



## గంగా నది నీళ్లు తాగితే పోతారు..

- నఅవి తాగడానికి పనికిరావు.. కేవలం స్నానానికే
- నఉత్తరాఖండ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రకటన
- నమానవ వ్యర్థాల వల్లే కాలుష్యం..స్థానిక పూజారుల ఆందోళన

..మిగతా 4 లో

# ఎకరాకు కోటి ఆదాయం ఎలా సంపాదించాలో చెప్పు కేసీఆర్

- అసెంబ్లీ సమావేశాలకు రా
- నీ మేధావితనం ఏమిటో రైతులకు చెప్పు
- కేసీఆర్ కుటుంబం బీసీ వ్యతిరేకి
- కులగణనలో ఎందుకు పాల్గొనడం లేదు..?
- వాళ్లని సామాజిక బహిష్కరణ చెయ్యాలి
- తెలంగాణ ఉద్యమం ఉద్యోగాల కోసమే..
- ఏడాదిలో 55వేల ఉద్యోగాలిచ్చాం
- గుజరాత్‌లో ఏడాదిలో 55వేల ఉద్యోగాలిచ్చారా..?
- ఒక్కరోజులో ఎవరూ అద్భుతాలు సృష్టించరు
- పదేళ్లు పాలించి.. పది నెలలు ఆగలేకపోతున్నారు
- ప్రజాపాలనపై విషప్రచారం చేస్తున్నారు
- ప్రజల ఆశీస్సులతోనే నేను సీఎం అయ్యా
- కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం
- వాళ్లంతా ఓట్లేస్తే మళ్లీ వచ్చేది కాంగ్రెస్ సర్కారే
- యువ వికాసం సభలో సీఎం రేవంత్ రెడ్డి



“ కేసీఆర్ కుటుంబం బీసీలకు వ్యతిరేకులని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కులగణనలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. ఈ ముగ్గురూ బీసీ వ్యతిరేకులా? బీసీల ఓట్లు వేయించుకోలేదా? ఒక మంచి పని కోసం ప్రభుత్వాలు ముందుకొచ్చినప్పుడు ఎందుకు సహకరించట్లేదని అడిగారు. బీసీ కులగణనలో పాల్గొనని వారిని ఈ సమాజం బహిష్కరించాలంటూ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాస సభలో సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలనను పోల్చి చూడాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజాపాలనపై విపక్షాలు తప్పడు ప్రచారం చేస్తున్నాయని, ప్రతిపక్షాల విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ప్రజల ఆశీస్సులతోనే సామాన్యుడు సీఎం అయ్యాడని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ తెచ్చుకున్నది ఉద్యోగాల కోసమేనని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత తమకే దక్కుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే 55 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించామని, అలాగే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువకుల్లో వృత్తి నైపుణ్యతను పెంపొందించే చర్యలకు శ్రీకారం చుట్టామన్నారు. మోదీ సీఎం, పీఎంగా ఉంటూ గుజరాత్‌లో ఏడాదిలో 55వేల ఉద్యోగాలు ఇచ్చారా? సమాధానం చెప్పాలంటూ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ను ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నియామక పత్రాలు ఇచ్చామన్నారు.

**కేసీఆర్ ఆ రహస్యం చెప్పాలి..**

కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం. కోటి మంది ఆడబిడ్డలు

..మిగతా 2 లో



## ట్రాఫిక్ వలంటీర్లుగా ట్రాన్స్ జెండర్లు

- తొలి రోజు 44 మంది ఎంపిక
- ఈవెంట్లను పరిశీలించిన కమిషనర్ సీవీ ఆనంద్

2 లో

## ఇందిరమ్మ ఇళ్లు వచ్చేస్తున్నాయ్..

- నేటి నుంచి లబ్ధిదారుల ఎంపిక
- మొబైల్ యాప్ ప్రారంభించనున్న సీఎం రేవంత్
- ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం
- మహిళ పేరు మీద ఇల్లు మంజూరు
- ప్రతి మండలంలో మోడల్ హౌస్ నిర్మాణం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక నేటినుంచి ప్రారంభించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా రూపొందిచిన మొబైల్ యాప్‌ను సీఎం రేవంత్ రెడ్డి నేడు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితి, ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి స్వరూపం, కుటుంబ సభ్యుల వివరాలు, ఇంటి నిర్మాణానికి సంబంధించిన భూమి వివరాలు వంటి అంశాలు ఈ యాప్‌లో ఉండనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు వీలుగా ప్రతి గ్రామం, వార్డులలో

..మిగతా 2 లో

## నన్ను అరెస్టు చేస్తారేమో..?

- అలా చేయకుండా పోలీసులకు ఆదేశాలివ్వండి
- నాపై పెట్టిన కేసును కొట్టివేయండి
- రాజకీయ కక్షతోనే కేసు పెట్టారు
- హైకోర్టును ఆశ్రయించిన హరీష్ రావు
- తెరపైకి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపణలు
- తెలంగాణలో మరోసారి పొలిటికల్ హీట్



2 లో

## రేవంత్.. మహిళలకు రూ.2500 ఎక్కడ..?

- ఒక్కొక్కరికీ రూ.30వేలు బాకీ పడ్డావ్
- పెన్షన్ల పెంపు ఏమైంది..?
- రాష్ట్రంలో అసలు పాలన ఉందా?
- అబద్ధాలతో ఎన్ని రోజులు కాలం ఈడుస్తారు
- కేంద్రం చేతిలోనే నాగార్జున సాగర్
- అక్కడికెళ్లి నీ నరసింహావతారం చూపించు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలన్నీ అమలు చేసేంత వరకు వెంటపడుతూనే ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. ప్రభుత్వంలో జరిగే తప్పులను తెలంగాణ జాగృతి సంస్థ ఎప్పటికప్పుడు ఎత్తిచూపిస్తుందన్నారు. బుధవారం నాడు తన నివాసంలో జరిగిన తెలంగాణ జాగృతి వరంగల్, నల్గొండ జిల్లాల నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత ప్రసంగించారు. సీఎం తమకు ఏదో చేస్తారన్న విశ్వాసం ప్రజల్లో లేదని స్పష్టం చేశారు. మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామ



ని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంకా ఇవ్వడం లేదు. నెలకు రూ. 2500 చొప్పున రూ. 30 వేలు ఒక్కో

..మిగతా 2 లో



## సీఐ Vs కౌశిక్ రెడ్డి

- బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో రచ్చ
- ఫోన్ ట్యాపింగ్ ఇష్యూలో కౌశిక్ రెడ్డి ఫిర్యాదు
- కంప్లైట్ తీసుకునేందుకు సీఐ నిరాకరణ
- దురుసు ప్రవర్తనతో రెచ్చిపోయిన ఎమ్మెల్యే
- కౌశిక్‌రెడ్డి సహా 20 మందిపై కేసు

..మిగతా 2 లో



## హైదరాబాద్‌కు.. గూగుల్ వచ్చేస్తోంది

- ఫలించిన సీఎం రేవంత్ మంత్రాంగం
- నగరంలో గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్
- రాష్ట్ర ప్రభుత్వంతో కీలక ఒప్పందం
- దేశంలో మొదటి సెంటర్‌ఇదే

..మిగతా 2 లో

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

గురువారం,
05.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# సీఐ Vs కౌశిక్ రెడ్డి

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మరోసారి దురుసు ప్రవర్తనతో రెచ్చిపోయారు. తన ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారంటూ తన అనుచరులతో కలిసి బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చేందుకు వెళ్లి నానా రభస చేశారు. అర్జంట్ పనిమీద బయటకు వెళ్లాలని, వచ్చిన తర్వాత ఫిర్యాదు తీసుకుంటానని చెప్పినా వినకుండా సీఐ వాహనాన్ని అడ్డుకుని నినాదాలు చేశారు. దీంతో చేసేదేమిలేక సీఐ వెనక్కి వచ్చి కౌశిక్ రెడ్డి వద్ద ఫిర్యాదు తీసుకున్నారు. అయినప్పటికీ ఎమ్మెల్యే తన అంతుచూస్తానంటూ పరోక్షంగా వార్నింగ్ ఇవ్వడంతో ఇరువురి మధ్య వాగ్వాదానికి దారి తీసింది. వెంటనే విధులు అడ్డగించి బెదిరించారని ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఫిర్యాదు చేయడంతో కౌశిక్‌రెడ్డి సహా 20 మంది అనుచరులపై కేసు నమోదు చేశారు.

**నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు: కౌశిక్ రెడ్డి**

సీఎం రేవంత్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్‌రెడ్డి కలిసి తన ఫోన్‌ని ట్యాప్ చేస్తున్నారని.. వీరిద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదు చేసేందుకు తాను పీఎస్‌కి వెళ్లానని కౌశిక్ రెడ్డి చెప్పారు. బంజారాహిల్స్ ఏసీపీకి ఇవాళ ఉదయం ఫోన్ చేస్తే 3 గంటలకు రమ్మన్నారని.. తాను స్టేషన్‌కు వెళ్లేకన్నా ముందే ఏసీపీ వెళ్లిపోయారని.. సీఐ సైతం వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తే తనతో పార్టీ కార్యకర్తలు ప్రశ్నించారన్నారు. తాను ఎమ్మెల్యే అనే గౌరవం లేకుండా సీఐ ప్రవర్తించారని.. డీజీపీ కన్నా ఎక్కువ ప్రోటోకాల్ ఎమ్మెల్యేకు ఉంటుందని సీఐకి ఉంటుందని.. పదవులు లేని సీఎం సోదరులకు పోలీసులు వంగి వంగి దండాలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఓ మిత్రుడి పార్టీకి వెళితే శివధర్ రెడ్డి ఫోన్ ట్యాప్ చేసి.. అక్కడికి పోలీసులను పంపారని.. నా దగ్గర డ్రగ్స్ పెట్టించి కేసు పెట్టించాలని శివధర్ రెడ్డి ప్రయత్నించారన్నారు. సీఎం రేవంత్, శివధర్ రెడ్డిపై కేసు నమోదు చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు.

**రేవంత్ వల్లే రాష్ట్రంలో భూకంపం**

తమ నేత హరీష్ రావుపై బ్రోకర్ రేవంత్ రెడ్డి సూచనతో బ్రోతల్ చక్రధర్ గౌడ్ ఫోన్ ట్యాపింగ్ కేసు పెట్టారని.. బ్రోకర్, బ్రోతల్‌లు కేసు పెడితే పోలీసులు హరీష్ రావుపై ఎఫ్ఐఆర్ ఎలా నమోదు చేస్తారని కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. హరీష్ రావుపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే నా కేసు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ, ఇంటెలిజెన్స్ ఐజీపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందేనన్నారు. నేనిచ్చిన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి హెచ్చరించారు.

సీఎం రేవంత్ రెడ్డి దేవుళ్ళ మీద ఒట్లు వేయడం వల్లే రాష్ట్రంలో భూ కంపం వచ్చిందని.. సీఎం పాపాల నుంచి ప్రజలను దేవుళ్ళే కాపాడాలన్నారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని.. చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తున్న పోలీసులపై చర్యలు తప్పవని కౌశిక్ రెడ్డి హెచ్చరించారు.

## ఇందిరమ్మ ఇళ్లు వచ్చేస్తున్నాయ్..

తరువాయి భాగం

ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను ఏర్పాటు చేశాం. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నాం. మహిళ పేరు మీద ఇళ్లు మంజూరు చేస్తున్నామని.. ఈ ఇళ్లకు నాలుగు దశల్లో లబ్ధిదారులకు చెల్లింపులు చేస్తామన్నారు. మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తామన్నారు. ఈ పథకం కింద నిర్మించే ఇళ్లు కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం, వంటగది, టాయిలెట్ సౌకర్యాలను కలిగి ఉంటాయని వెల్లడించారు. ఇక గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండేది. ఇప్పుడు ఆ వ్యవస్థను రద్దుచేసి లబ్దిదారులే ఇళ్లు నిర్మించుకునేలా అవకాశం కల్పిస్తున్నాం. లబ్దిదారులు తమ సౌలభ్యాన్ని బట్టి 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఎంత విస్తీర్ణంలోనైనా నిర్మించుకోవచ్చు. రాష్ట్రంలోని ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాలను చేపడతామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో 2006-2007లో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. తెలంగాణ ప్రాంతంలో 2006-2007 నుంచి 2014 వరకు 23,85,188 ఇళ్లను మంజూరు చేయగా 19,32,001 ఇళ్లను పూర్తి చేసింది. 4,53,187 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా బీఆర్ఎస్ గాలికొదిలేసిందంటూ విమర్శించారు.

# ఎకరాకు కోటి ఆదాయం ఎలా సంపాదించాలో చెప్పు కేసీఆర్

తరువాయి భాగం

ఓటేస్తే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది. రాష్ట్రంలోనే అత్యధికంగా వడ్లు పండిస్తున్న జిల్లా.. పెద్దపల్లి జిల్లా. గతంలో బీఆర్ఎస్ పాలనలో రైతులకు గిట్టుబాటు ధర రాలేదు. గజ్వేల్‌లోని తన పొలంలో ఎకరాకు రూ.కోటి సంపాదిస్తున్నానని మాజీ సీఎం కేసీఆర్ చెప్పారు. పదేళ్లు పాలించిన ఆయన.. ఎకరాకు రూ.కోటి ఎలా సంపాదించాలో మాత్రం రాష్ట్రంలోని అన్నదాతలకు చెప్పలేదు. ఆయన విద్య ఏందో.. ఆ రహస్యం ఏంటో ఈరోజుకూ అంతుచిక్కడం లేదని విమర్శించారు. కేసీఆర్ శాసనసభకు రావాలి.. తన మేధావితనాన్ని ప్రజలకు పంచాలి. ఎకరంలో రూ.కోటి పంట ఎలా పండించారో రైతులకు చెప్పాలని డిమాండ్ చేశారు.

**ప్రజాపాలనపై విషప్రచారం..**

ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కష్టపడుతోందని.. కడుపుమంటతో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ అన్నారు. పదేళ్లు మోసం చేసినోళ్లు పది నెలలు ఆగలేక పోతున్నారని మండిపడ్డారు. శత్రువు ఏం చేస్తున్నారో చూస్తున్నామని.. పది రోజుల్లో వాళ్ల విష ప్రచారాన్ని తిప్పికొడతామన్నారు. వరి వేసుకుంటే ఉరే అని మాట్లాడిన చరిత్ర కేసీఆర్‌ది. వడ్లు పండించండి.. సన్నాలు వేయండి మద్దతు ధరతో పాటు బోనస్ ఇస్తామని చెప్పిన చరిత్ర మాది. 33 జిల్లాల్లో అత్యధికంగా 2 లక్షల ఎకరాల్లో సన్న వడ్లు పండించిన ఘనత పెద్దపల్లి జిల్లాది. 95 శాతం రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు పడ్డాయని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

**10 ఏళ్ల పాలన.. 10 నెలల పాలనపై చర్చకు సిద్ధమా..?**

మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ ఊర్ల మీద పడి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు.. అచ్చొచ్చిన ఆంబోతుల్లా మాట్లాడటం కాదు.. పదేళ్ల పాలనలో మీరేం చేశారు.. 10 నెలలలో మేమేం చేశామో చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొందని.. తన ప్రభుత్వంలో కట్టిన ప్రాజెక్టుల లెక్కలు తీయడానికి కేసీఆర్ సిద్ధమా అని ప్రశ్నించారు. కుక్క తోక తగిలి పందిరి కూలినట్టుగా కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిస్థితి మారిందని ఎద్దేవా చేశారు.

**కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం..**

చాలా ఏళ్ల తర్వాత ఆడబిడ్డల కళ్లలో సంతోషం చూశానని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యంలో స్వయం సహాయక సంఘాలను పునరుద్ధరించామని.. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తామన్నారు. కోటి మంది ఆడబిడ్డలు ఓటేస్తే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందన్నారు. ప్రభుత్వం ఒక్కరోజులోనే అద్భుతాలు సృష్టిస్తుందా ? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఏ పని చేయాలన్నా విధివిధానాలు ఉంటాయని పేర్కొన్నారు. పదేళ్లు పాలించారని, పది నెలలైనా ఆగలేరా? అన్నారు. కేసీఆర్ హయాంలో యూనివర్సిటీలను నిర్వీర్యం చేశారని మేం అధికారంలోకి రాగానే యూనివర్సిటీలను బలోపేతం చేసామన్నారు. శాతవాహన యూనివర్సిటీకి ఇంజనీరింగ్, లా కాలేజీ కావాలని కోరారు.. వాటిని ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి.

**నాడు నిర్బంధం.. నేడు స్వేచ్ఛ**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ధర్నా చేసే పరిస్థితి ఉండేదా..? ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ధర్నాలు చేసిన ధర్నా చౌక్‌ను ఎత్తేసి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్బంధం విధించిందని దుయ్యబట్టారు. కానీ కాంగ్రెస్ పాలనలో స్వేచ్ఛగా ధర్నాలు చేస్తున్నారని.. ధర్నాలు చేసే వారిని గాంధీ భవన్‌కు పిలిచి మాట్లాడుతున్నామని తెలిపారు. ఆనాడు దొరలు ఉండే ప్రగతి భవన్‌ను.. మేం అధికారంలోకి వచ్చాక ప్రజా భవన్‌గా మార్చామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రజా పాలనకు ఇదే నిదర్శనమని అన్నారు. కేసీఆర్ కూతురు కవిత ఎంపీగా ఓడిపోతే మూడు నెలల్లో ఎమ్మెల్సీ చేశారు.. ఎంపీగా ఓడిన వినోద్‌కు కేబినెట్ పదవి ఇచ్చారు.. మీ కుటుంబంలో అందరికి ఉద్యోగాలు వచ్చాయి. కేవలం మీ కుటుంబ సభ్యుల కోసమా నిరుద్యోగులు ప్రాణ త్యాగాలు చేసిందని ప్రశ్నించారు. ఒక్క కుటుంబాన్ని అందలం ఎక్కించడం కోసమా స్వరాష్ట్రం సాధించుకుందని బీఆర్ఎస్ నేతలను నిలదీశారు.

**పెద్దపల్లిపై వరాల జల్లు**

పెద్దపల్లి యువవికాస సభలో సీఎం రేవంత్ వరాల జల్లు కురిపించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్‌తో పాటు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సైతం మంజూరు చేశారు. పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిని 100 పడకలకు పెంచేందుకు పర్మిషన్ ఇచ్చారు. నాలుగు వరుసల బైపాస్ రోడ్డు, మంథనిలో 50 పడకల ప్రభుత్వ నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేశారు. గుంజపడుగులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెద్దపల్లితో సహా మలుగు జిల్లాకు ఆర్టీసీ డిపోల ఏర్పాటుకు పర్మిషన్ ఇచ్చారు.

**నియామక పత్రాల ప్రదానం**

గ్రూప్4, సింగరేణి ఉద్యోగాలకు ఎంపికైనవారికి నియామక పత్రాలను సీఎం అందజేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలను, సీఎం కప్ ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సభలో పాల్గొన్నారు.

# నన్ను అరెస్టు చేస్తారేమో..?

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఫోన్ ట్యాపింగ్ ఇష్యూలో మాజీ మంత్రి హరీష్ రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ తనపై తప్పుడు కేసు పెట్టాడని పిటిషన్ లో పేర్కొన్నాడు. ఈ కొట్టివేయడంతో పాటు అరెస్టు చేయకుండా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. నిరోధర ఆరోపణలు చేసి సంబంధం లేని కేసులో ఇరికించారంటూ కోర్టుకు క్వాష్ పిటిషన్ లో వివరించారు. ఈ మేరకు సిద్దిపేటకు చెందిన కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డిసెంబర్ 1న హరీష్ రావుపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. హరీష్ రావు తన ఫోన్ టాప్ చేయించారని చక్రధర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో హరీష్ రావుతో పాటు మాజీ డిసిపి రాధాకృష్ణన్ రావుపై కేసు నమోదు చేసిన పంజాగుట్ట పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే తాజాగా హైకోర్టును ఆశ్రయించిన హరీష్ రావు.. రాజకీయ కక్షతోనే కేసు నమోదు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. నిరోధర ఆరోపణలు చేసి సంబంధం లేని కేసులో ఇరికించారని తెలిపారు.



**ఆర్ఎస్ ప్రవీణ్ ఆరోపణలు..**

హరీష్ రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసు నేపథ్యంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపణలు తెరపై కొచ్చాయి. 2023 జనవరిలో తన ఫోన్ హాక్ చేసేందుకు బీఆర్ఎస్ లేదా బీజేపీ ప్రయత్నించిందని ప్రవీణ్ చెప్పడం సంచలనం రేపింది. తాను వాడుతున్న యాపిల్ ఫోన్‌కు కూడా ఈ అలెర్ట్ మెసేజ్ వచ్చిందని, తన ఫోన్‌ను స్టేట్ స్పాన్సర్డ్ అటాకర్స్ హాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ హెచ్చరించిందని ప్రవీణ్ చెప్పారు. ఆ సమయంలో ఇది రాష్ట్ర స్థాయిలో బీఆర్ఎస్ పార్టీ లేదా కేంద్ర స్థాయిలో బీజేపీకి పార్టీ పని అయి ఉంటుందని ఆరోపించారు. దీంతో హరీష్ రావు ట్యాపింగ్ కేసుపై తెలంగాణలో మరోసారి పొలిటికల్ హీట్ ఎక్కింది.

# రేవంత్.. మహిళలకు రూ.2500 ఎక్కడ..?

తరువాయి భాగం

మహిళకు సీఎం బాకీ ఉన్నారు. రూ. 2 వేలు పెన్షన్ పెంచామని చెప్పారు కానీ పెంచలేదు. ఆ మొత్తం కూడా ఒక్కొక్కరికి రూ. 24 వేలు సీఎం బాకీ పడ్డారు. వీటన్నింటిపై మనం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కవిత చెప్పారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసినప్పుడే తెలంగాణ తల్లికి నిజమైన నివాళి అర్పించినవాళ్లవుతారని స్పష్టం చేశారు. తెలంగాణ తల్లి రూపురేఖలు మార్పు పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిమళ్లింపు రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. ప్రజల పట్ల ప్రేమపూర్వకంగా వ్యవహరించడం, ప్రజా సమస్యలపై ప్రశ్నించడమే తెలంగాణ సంస్కృతి అని తెలిపారు.

కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు తెలంగాణ చేతిలో ఉండేదని, ఇప్పుడు అక్కడ కేంద్ర బలగాలు మోహరించాయని తెలిపారు. "నరసింహావతారంలా పేగులు మెడల వేసుకుంటా అని సీఎం అంటున్నారు కాదా ? నిజంగా ధైర్యం ఉంటే నాగార్జున సాగర్ వద్ద నరసింహావతారం ఎత్తి కేంద్ర బలగాలను వెనక్కి పంపించి మన నీళ్లు మనకు తీసుకురావాలని సవాలు చేస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణ జలాలను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరలించుకుపోతుంటే సీఎం రేవంత్ రెడ్డి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా చేపట్టలేదని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం



పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు.

ఏ హాస్టల్ లో ఏ ఆడపిల్లకు అన్యాయం జరిగి చనిపోయినా అక్కడికి వెళ్లి ఆ అన్యాయాన్ని ప్రశ్నించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఆ తర్వాత దేశ వ్యాప్తంగా వస్తున్న సామాజిక మార్పులను పరిగణలోకి తీసుకొని బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం అంశాన్ని తీసుకున్నామని వ్యాఖ్యానించారు. గతంలో ప్రారంభించిన కార్యచరణను ముందుకు తీసుకెళ్తామని ప్రకటించారు. అనేక వర్గాల నుంచి తమకు మద్దతు వస్తోందని చెప్పారు.

కేసీఆర్ స్ఫూర్తితో, ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శకత్వంలో తెలంగాణ జాగృతి సంస్థ ఏర్పడిందని, తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా అనేక సామాజిక అంశాలపై తెలంగాణ జాగృతి ఉద్యమించిందని తెలిపారు. అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం పోరాడి సాధించామని గుర్తు చేశారు. 16 రాజకీయ పార్టీలను ఒప్పించి మహిళా రిజర్వేషన్ చట్టం సాకారం కావడానికి కృషి చేశామని స్పష్టం చేశారు.

## కేసీఆర్‌పై కోపంతో తెలంగాణ తల్లి

# రూపం మార్చొద్దు

తరువాయి భాగం

మార్చలేదు. దేశంలో ఎన్నోచోట్ల అధికార మార్పిడి జరిగింది. తెలుగుతల్లి విగ్రహ రూపం మారలేదు. కన్నడమాత విగ్రహం రూపు మారలేదు. కానీ, ఈ ముఖ్యమంత్రి.. కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. నాలుగేళ్ల తర్వాత రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టిన స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తాం. అధికారం ఉందని సాయుధ బలగాల నడుమ మీ నాటకాలు కొంతకాలం సాగుతాయి. కానీ, ఎల్లకాలం ఇదే పరిస్థితి ఉండదు'' అని కేటీఆర్ హెచ్చరించారు.

**రేవంత్‌కు ఫామ్‌హౌస్ రాసిస్తా..**

జోసెఫ్ గోబెల్స్ను ఆదర్శంగా తీసుకుని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పనిచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం అయింది. సంవత్సరం కాలంలో బీఆర్ఎస్ అనేక ఆటుపోట్లు ఎదుర్కొంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి, కేసీఆర్ అనారోగ్యం, కవిత జైలుకు వెళ్లడం, పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారారు. అయినా బీఆర్ఎస్ తట్టుకుని నిలబడిందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్ జనతా గ్యారేజ్‌గా మారిందని తెలిపారు. మరో నాలుగేళ్లు బీఆర్ఎస్ శ్రేణులు పోరాటం చేయాలని సూచించారు. రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో లక్ష కోట్ల అప్పులు, ప్రజల తిప్పలు అని సెటైర్ వేశారు.

# ట్రాఫిక్ వలంటీర్లుగా ట్రాన్స్ జెండర్లు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. తెలంగాణ వ్యాప్తంగా 3 వేల మంది వరకూ ట్రాన్స్‌జెండర్లు ఉంటే.. హైదరాబాద్‌లోనే సుమారుగా 1500 మంది ఉన్నట్లు అధికారుల అంచనా. సమాజంలో వివక్ష ఎదుర్కొంటున్న ట్రాన్స్‌జెండర్లను.. సమాజ సేవకు ఉపయోగించుకోవాలని.. వారికి సమాజంలో గౌరవం దక్కేలా చూడాలనే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి. ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి కల్పించడంతో పాటుగా, గౌరవమైన స్థానాన్ని అందించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి.. ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ వాలంటీర్లుగా తీసుకోవాలని గతంలో పోలీసులను ఆదేశించారు. సీఎం సూచన మేరకు హైదరాబాద్ పోలీసులు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం ట్రాన్స్‌జెండర్లకు ఈవెంట్లు నిర్వహించారు. రన్నింగ్, హైజంప్, లాంగ్ జంప్ వంటి పరీక్షలు నిర్వహించిన అధికారులు.. ఉత్తమమైన ప్రతిభ కనబరిచి ఎంపిక చేశారు. బుధవారం జరిగిన ఈవెంట్లలో మొత్తం 44 మంది ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ వాలంటీర్ల కోసం ఎంపిక చేశారు. బుధవారం ఈవెంట్స్‌లో 58 మంది ట్రాన్స్‌జెండర్లు పాల్గొనగా.. 44 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో 29 మంది ఉమెన్స్, 15 మంది మెన్ ట్రాన్స్ జెండర్ అభ్యర్థులు ఉన్నారు. ఈవెంట్లలో భాగంగా వంద మీటర్ల రన్నింగ్, 800 మీటర్ల రన్నింగ్, షార్ట్ పుట్, లాంగ్ జంప్ వంటి పోటీలు నిర్వహించారు. ఈవెంట్స్‌కు హాజరయ్యేందుకు కొన్ని అర్హతలను కూడా అధికారులు నిర్దేశించారు.

# హైదరాబాద్‌కు.. గూగుల్ వచ్చేస్తోంది

**ఫలించిన సీఎం రేవంత్ మంత్రాంగం**

**నగరంలో గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్**

**రాష్ట్ర ప్రభుత్వంతో కీలక ఒప్పందం**

**దేశంలో మొదటి సెంటర్‌ఇదే**

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



తెలంగాణ సీఎం రేవంత్ సర్కార్ ఏడాది పాలన పూర్తయ్యే క్రమంలో.. నూతన శకానికి నాంది పలికింది. ఏకంగా గూగుల్ సంస్థతో ఒప్పందాన్ని ఏర్పరచుకొని, హైదరాబాద్ నగరం వైపు ప్రపంచం చూసేలా సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని బుధవారం గూగుల్ సీఐఓ రాయల్ హాన్సెన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగరంలో ఏర్పాటుచేసే పలు సంస్థల గురించి వారిద్దరి మధ్య చర్చలు సాగాయి. దీనితో తెలంగాణలో భారీ పెట్టుబడులకు గూగుల్ సిద్ధమైంది.హైదరాబాద్ లో భారత దేశంలోనే మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ను స్థాపించేందుకు నేడు సీఎం రేవంత్ రెడ్డిని గూగుల్ సీఐఓ కలిశారు. ఆసియా పసిఫిక్ రీజియన్‌లో టోక్యో తర్వాత ఏర్పాటు చేసే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ హైదరాబాద్ లో స్థాపించడం గమనార్హం. ఈ సెంటర్ అధునాతన భద్రత, ఆన్లైన్ భద్రత ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది.ఇటీవల యూఎస్ఏలోని గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సీఎం రేవంత్ రెడ్డి సందర్శించిన సందర్భంగా అక్కడ గూగుల్ సమస్త ప్రతినిధులతో పలు అంశాలను సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. హైదరాబాద్ నగరంలో జిఎస్ఈసిని ఏర్పాటు చేసేందుకు, గూగుల్ ముందుకు రావడం తనకు గర్వంగా ఉందంటూ సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. సీఎం రేవంత్ మాట్లాడుతూ.. యావత్ భారత్ లోనే హైదరాబాద్ నగరం ఐటీ మరియు ఇన్నోవేషన్ హబ్ గా నిలుస్తుందనడానికి గూగుల్‌తో గల తమ భాగస్వామ్యం నిదర్శనమన్నారు. డిజిటల్ స్కిల్ డెవలప్మెంట్లో తెలంగాణ ఎప్పుడు ముందులో ఉంటుందని, ఇప్పటికే అత్యంత విలువైన ఐదు టెక్స్ కంపెనీలు హైదరాబాద్ లో ఉన్నాయన్నారు.గూగుల్‌తో జరిగిన ఒప్పందంతో డిజిటల్ భద్రతను మరింత పటిష్టం చేసేందుకు అవకాశం ఉంటుందని, సైబర్ సెక్యూరిటీ కార్యక్రమాలలో హైదరాబాద్ అగ్రగామిగా నిలుస్తుందని సీఎం రేవంత్ అన్నారు. ఈ సందర్భంగా హాన్సెన్ మాట్లాడుతూ.. డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ ముందంజలో ఉందని అన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజనీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉంది. ఇప్పటికే ప్రపంచంలో పేరొందిన అయిదు టెక్ కంపెనీలు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, అమెజాన్, ఫేస్‌బుక్ ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడు సేఫ్టీ సెంటర్ ద్వారా స్థాయిలో సైబర్ సేఫ్టీ సమస్యలను వేగంఅ పరిష్కరించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు.ఈ సెంటర్ ఏర్పాటుతో వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. గూగుల్ మేనేజ్‌మెంట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేలా ఒప్పించిన రేవంత్ సర్కార్ కు నెటిజన్స్ సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలుపుతున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు గూగుల్ ప్రతినిధులు పాల్గన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
05.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## ఈనెల 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 9వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సమావేశాల్లో పలు అంశాలు చర్చించనున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై అధికారికంగా ప్రకటన వెలువడినా ఎన్ని రోజులు సమావేశాలు నిర్వహిస్తారనేది ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న బీఏసీ సమావేశంలో నిర్ణయం ఉంటుంది. ఇప్పటికే జనవరి సంక్రాంతి తరువాత రైతు భరోసా వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.అయితే అందుకు సంబంధించిన విధివిధానాల రూపకల్పనపై ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం కూడా ఇప్పటికే పలు అంశాలతో కూడిన నివేదిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ అంశాలను అసెంబ్లీలో చర్చించి రైతు భరోసా అర్హులైన రైతులకే దక్కేట్లు ముందుకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోంది. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ బిల్లును సైతం ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. కొత్తగా తీసుకురానున్న ఆర్వోర్ చట్టంతోపాటు, రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న కులగణన సర్వే ద్వారా వచ్చే గణాంకాలను అసెంబ్లీలో పెట్టి చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

# సర్కిల్ 4 డిసి ని సస్పెండ్ చేయాలి

▸ కార్యాలయం ముందు ధర్నా చేసిన ఉద్యోగులు

ఎల్బీనగర్ విశాలభారతి :



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎల్బీనగర్ జోనల్ పరిధిలోని సర్కిల్ 4 ఉద్యోగులు బుధవారం సరూర్ నగర్ సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సర్కిల్ 4 డిప్యూటీ కమిషనర్ ఇస్లావత్ సేవానాయక్ ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసారు. డిసి ఉద్యోగుల పట్ల ప్రవర్తిస్తున్న తీరు హేయమైన చర్యగా అభివర్ణించారు. నియంత నిరంకుషత్వ పాలన సాగిస్తూ ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. మానసికంగా శారీరకంగా మహిళా ఉద్యోగులను సైతం వేధింపులకు గురిచేస్తున్నాడని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు ఉదయం 6 గంటలకు ఫీల్డ్ మీద ఉండగా టీ తాగే సమయంలో ఫోటోలు తీసి మీరు సరిగ్గా విధులు నిర్వహించడం లేదని హాజరు వేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. మానసిక ఒత్తిడి లేకుండా మాతో పని చేయిస్తే చేస్తాము లేదంటే మమ్మల్ని అందరిని ఇక్కడినుండి బదిలీ చేయాలని మూకుమ్మడిగా తేల్చి చెప్పారు. డిసి మానసికంగా ఒత్తిడి చేయడం వల్లనే ఏఎంసి శ్రీనివాసరాజు తన ఇంటినుండి కార్యాలయానికి వస్తుంటే బైక్ అదుపుతప్పి కిందపడ్డాడని తీవ్ర గాయలపాలై ప్రస్తుతం ఆసుపత్రిలో ఐసియు లో చికిత్స పొందుతున్నాడని ఆవేదన వ్యక్తం చేసారు. కేవలం డిసి భయపెట్టడం వల్లనే అతను నేడు ఆసుపత్రిలో ఉన్నాడని తెలిపారు. వెంటనే డిసి ఇస్లావత్ సేవా నాయక్ ను సస్పెండ్ చేసి మమ్మల్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేసారు. భాగ్యనగర్ మజ్దూర్ ఎంప్లాయిస్ యూనియన్ (జిహెచ్ఎంసి) ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాకు సర్కిల్ 3, సర్కిల్ 5 ఉద్యోగులు సైతం సంఘీభావం ప్రకటించి ధర్నాలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, ప్రెసిడెంట్ శంకర్ జనరల్ సెక్రెటరీ అశ్రఫ్ ఉద్యోగులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**వివరణ..**

ఈ విషయమై సర్కిల్ 4 డిప్యూటీ కమిషనర్ ఇస్లావత్ సేవానాయక్ ను వివరణ కోరగా నేను అందరి పట్ల మంచిగానే ఉంటున్నట్లు ఎవరిని ఇబ్బంది పెట్టడం లేదని తెలిపారు. పన్నులు వసూలు చేసే విషయమై ఉన్నతాధికారుల సూచనలను వీరికి చెప్పానే తప్ప మరే ఉద్దేశం లేదన్నారు.

## గీతం స్కాలర్ అభిలాషకు డాక్టరేట్

పటాన్ చెరు,విశాలభారతి



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లోని రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి అభిలాష దుబ్బా డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'ఐదు హెటెరోసైక్లిక్ సమ్మేళనాలను కలిగి ఉన్న ఇండోల్ యొక్క సంశ్లేషణ, ఫార్మకోలాజికల్ మూల్యాంకనం' అనే అంశంపై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ కొప్పుల బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.అభిలాష పరిశోధన ఫార్మాకోఫోర్ హైబ్రిడైజేషన్ పద్ధతిని ఉపయోగించి నూతన హెటెరోసైక్లిక్ సమ్మేళనాల సంశ్లేషణపై దృష్టి పెట్టడడమే గాక, వాటి జీవసంబంధ కార్యకలాపాలను మూల్యాంకనం చేసినట్టు తెలియజేశారు. ఈ పరిశోధనలో సంశ్లేషణ చేసిన సమ్మేళనాలు నూతన క్యాన్సర్ నిరోధక, బాక్టీరియా నిరోధక ఏజెంట్ల కోసం అన్వేషణలో విలువైన ఔషధ గుణాలు గల అణువులుగా ఉపయోగపడే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని, ఇది ఔషధ రసాయన శాస్త్రంలో మంచి పురోగతిని సూచిస్తోందన్నారు. అభిలాష సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్ ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మోతహర్ రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వవ్యాప్తంగా ఉన్న శాస్త్రీయ సమూహానికి దోహదపడే వినూత్న పరిశోధన, విద్యా పురోగతిని గీతం ప్రోత్సహిస్తోందన్నారు. అభిలాష చేసిన ఈ పరిశోధనా ఫలాలు విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని, పరిశోధనా వాతావరణాన్ని పెంపొందించాలనే విశ్వవిద్యాలయ లక్ష్యాన్ని బలోపేతం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.




## మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత

▸ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు,విశాలభారతి

మహిళా స్వయం సహాయక సంఘాలు బలోపేతం చేయడం ద్వారా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవ వారోత్సవాలలో భాగంగా.. బుధవారం బొల్లారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో..నాలుగు మహిళా స్వయం సహాక సంఘాలకు మంజూరైన 50 లక్షల రూపాయల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల జీవితాల్లో ఆర్థిక స్వావలంబన సాధించేందుకు స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం నుండి అందిస్తున్నారు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోలన్ రోజా బాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మంగ తాయారు, సీనియర్ నాయకులు కౌన్సిలర్ చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలు

▸ వివిధ వేషధారణలతో అలరించిన విద్యార్థులు

అనంతగిరి, విశాలభారతి:

లక్ష్యానికి క్రమశిక్షణ తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చు అని అనంతగిరి జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్ కే సలీం అన్నారు. బుధవారం అనంతగిరి మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం వివిధ హోదాల్లో వేషధారణలతో విద్యార్థులు అలరించారు. జిల్లా కలెక్టర్ గా వెన్నెల, ఎమ్మెల్యేగా అక్షయ, డీఈవోగా సిరి, ఎమ్మార్వో గా అమృత, ఎంఈఓ గా సీమ, ప్రధానోపాధ్యాయులుగా నీల, ఉపాధ్యాయులుగా విద్యార్థులు వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. అనంతరం వేషధారణలో విద్యార్థులు పోషించిన పాత్రలకు గాను పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు వివిధ హోదాల్లో వేసిన వేషధారణలో అలంకరించిన పాత్రలను విద్యార్థులు ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ తమ లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ లింగమ్మ, ఉపాధ్యాయులు సుకన్య, కనకరావు ,బాలరాజు, లక్ష్మీ, గోవిందరెడ్డి, నాగమణి, సైదులు, కాశీం, జానకి రాములు, ఉపేంద్రమ్మ, జానిమియా, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన హెల్త్ ఆఫీసర్

అడవిదేవులపల్లి, విశాలభారతి:




మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిస్టిక్ ఇమ్యూనిసషన్ ఆఫీసర్ ఎస్ పద్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని వ్యాధి నిరోధిక టీకాల రికార్డు పరిశీలించారు. అదే విధంగా మొల్కచెర్ల గ్రామ పరిధిలో సబ్ సెంటర్లో జరిగే టీకాల ఇంజనేషన్లోను పరిశిలించి ఏఎన్ఎం మరియు ఆశలకు తగు చూచనలు ఇవ్వటం జరిగింది. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని టీకాల నిల్వలు రికార్డు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డా. సయ్యద్ అజహర్ రహ్మద్ డా. రామాంజనేయులు, సిహెచ్ఓ షాహిద్ షాహెడ్, ఫార్మసెస్ట్ స్వరూప, వీసీచ్ ఉదయ్, ఏఎన్ఎమ్స ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి ప్రధాన కార్యదర్శిగా వేముల గోపీనాథ్

శాలిగౌరారం, విశాలభారతి:



నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన వేముల గోపీనాథ్ ఇటీవల తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం వెలువడిన ఫలితాలలో ఓపెన్ క్యాటగిరిలో తుంగతుర్తి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా గోపీనాథ్ ఎన్నికయ్యారు . ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక అయ్యేందుకు సహకరించిన యూత్ కాంగ్రెస్ నాయకులకు, మిత్రులకు ,శ్రేయోభిలాషులకు ప్రత్యేకమైన కృతజ్ఞతలను తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. యువతకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వేముల గోపీనాథ్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

## ఘనంగా 18వ అయ్యప్ప స్వామి మహా పడిపూజ

ఎల్బీనగర్ విశాలభారతి:



బ్రహ్మశ్రీ రంజిత్ తంత్రి , చెరుకు శివకుమార్, పల్లె మహేష్ గౌడ్, చెరుకు ప్రవీణ్ గౌడ్, మోహన్ రెడ్డి గురు స్వాముల సమక్షంలో నూతన కంటి భాస్కర్ ఆధ్వర్యంలో 18వ మహా పడిపూజ నాగోల్ డివిజన్ పరిధిలోని జైపూర్ కాలనీ బీరప్ప టెంపుల్ యెగ్గ మల్లేశం గార్డెన్స్ లో మంగళవారం నాడు ఎంతో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మహా పడిపూజకు దాదాపుగా 1500 మందికి పైగా స్వాములు భక్తులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కంటి భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఇదే విధంగా ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయప్ప దయవల్ల ప్రజలందరూ బాగుండాలని కోరారు. అయ్యప్ప ఆశీస్సులు ప్రతి సంవత్సరం కూడా ఇంతే ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్వాములు,తదితరులు పాల్గొన్నారు.



## పేదల సమస్యలను పరిష్కరిస్తాం

▸ వారికి కనీస అవసరాలను వెంటనే కల్పిస్తాం

మేడిపల్లి,విశాలభారతి:

పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోలోని 6 వ డివిజన్ ప్రజలు మరియు పెద్దల ఆహ్వానం మేరకు డివిజన్ లో పర్యటించిన మేయర్ అమర్ సింగ్ మరియు Dy.మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ .భారీగా తరలి వచ్చిన డివిజన్ ప్రజలు ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుట్టమీద ఎన్నో సంవత్సరాల నుండీ నివసిస్తున్న పేదలకు మినిమమ్ అవసరాలను కూడా తీర్చలేక పోయారని కొలతలు వేయడం, హంగామా చేయడం, తరువాత కనీసం అటు తొంగి చూడలేదని, నెల క్రితం నేను Dy. మేయర్ కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులతో పర్యటన చేసి ఈ పేదలకు మినిమమ్ ఫెసిలిటీ కల్పించాలని నిర్ణయించి పేపర్ వర్క్ కంప్లీట్ చేసి, ఈరోజు మరొక సారి ప్రజలను కలసి వారి సమక్షంలో త్వరలోనే పనులను మొదలు పెట్టాలని కాంట్రాక్టర్ను ఆదేశించడం జరిగింది.ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు B. నవీన్ రెడ్డీ, M. చంద్రారెడ్డి, పప్పుల అంజిరెడ్డి, ప్రభాకర్ గౌడ్,షేక్. ఇర్ఫాన్, వంగూరు పరమేష్, వంగురు. ప్రభంజన్,విష్ణు వర్ధన్, కరీం, తన్వీర్, జాఫర్, హైదర్, ఖాజా,ఆర్య మహిళలు బాస్తీ వాసులు పాల్గొన్నారు.

### యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా

## పసుల అశోక్ యాదవ్

నూతనకల్, విశాలభారతి:



ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన పసుల అశోక్ యాదవ్ ఇటీవల తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేశారు. బుధవారం వెలువడిన ఫలితాలలో ఓపెన్ క్యాటగిరిలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా పసుల అశోక్ యాదవ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పాల్వాయి కార్తీక్, తిరుమల్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి లుగా బొల్క సైదులు యాదవ్, బొల్లేపల్లి సాయికుమార్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పసుల అశోక్ యాదవ్ మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నిక అయ్యేందుకు సహకరించిన యూత్ కాంగ్రెస్ నాయకులకు, మిత్రులకు ,శ్రేయోభిలాషులకు ప్రత్యేకమైన కృతజ్ఞతలను తెలిపారు. మండల వ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. యువతకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అశోక్ యాదవ్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

కోదాడ, విశాలభారతి:



మునగాల మోడల్ స్కూల్ లో మధ్యాహ్న భోజనంను తహసిల్దార్ ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మునగాల మోడల్ స్కూల్ పరిశీలించడం జరిగిందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారమే అందించాలని ఆదేశించారు, బియ్యంలో ఎలాంటి పురుగులు లేకుండా చూసుకోవాలని, కూరగాయలు ఎప్పటికప్పుడు పరిశుభ్రకరమైనాయి తీసుకురావాలని ఆదేశించినారు. కిచెన్, వంటశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు వడ్డించేడానికంటే ముందే స్కూల్లోని పనిచేసే టీచర్ ప్రతి రోజు పరిశీలించి సరిగా ఉంటేనే రిజిస్టర్లో నమోదు చేసిన తదుపరి మాత్రమే విద్యార్థులకు వడ్డించాలని తెలిపారు. మంచి నీరు కూడా సరఫరా చేయాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సైదయ్య గౌడ్, టీచర్లు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

గురువారం,
05.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## గంగా నది నీళ్లు తాగితే పోతారు..

విశాలభారతి, నేషనల్ బ్యూరో:
హరిద్వార్‌లోని గంగా నది నీరు తాగడానికి పనికిరాదని ఉత్తరాఖండ్ కాలుష్య నియంత్రణ మండలి తేల్చిచెప్పింది. అయితే స్నానానికి వినియోగించుకోవచ్చని సూచించింది. గంగా నదిలో నీటి నాణ్యత కేటగిరీ 'బి' స్థాయికి పడిపోయిందని తెలిపింది. "కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నీటి నాణ్యతను 5 తరగతులుగా విభజించింది. అందుకు పీహెచ్, కరిగిన ఆక్సిజన్, బయోలాజికల్ ఆక్సిజన్, కోలిఫాం బ్యాక్టీరియా వంటి నాలుగు పరిమితుల ఆధారంగా నీటి నాణ్యతను అంచనా వేస్తోంది. హరిద్వార్‌లో గంగా నదిలోని నీటి నాణ్యత 'బి' కేటగిరీలో ఉంది. అంటే ఆ గంగా జలం తాగడానికి పనికిరావు. స్నానానికి అనువుగా ఉంటాయి" అని ఉత్తరాఖండ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్(యూకేపీసీబీ) ప్రాంతీయ అధికారి రాజేంద్ర సింగ్ తెలిపారు.

'మానవ వ్యర్థాల వల్లే కాలుష్యం'

హరిద్వార్‌లో గంగా నది నీటి కాలుష్యంపై స్థానిక పూజారి ఉజ్వల్ పండింట్ ఆందోళన వ్యక్తం చేశారు. మానవ వ్యర్థాల వల్ల గంగాజల స్వచ్ఛత దెబ్బతింటుందని ఆరోపించారు. "గంగాజలంతో స్నానం చేయడం క్యాన్సర్ సహా శరీరంలోని ఇతర రోగాలు నయమవుతాయి. గంగాజలాన్ని తీసుకుని 10 ఏళ్ల తర్వాత తనిఖీ చేసినా దాని స్వచ్ఛత తగ్గదు. గంగాజలం స్వచ్ఛత మానవ వ్యర్థాల వల్లే దెబ్బతింటోంది. దానిని అరికట్టాల్సిన అవసరం ఉంది" అని పూజారి ఉజ్వల్ పండింట్ వ్యాఖ్యానించారు.

# వాచ్ టవర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే

▸ ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికిన అటవీ శాఖ అధికారులు

మణుగూరు, విశాలభారతి:



మణుగూరు ప్రజా పాలన విజయోత్సవాల నేపద్యంలో బుధవారం నాడు హనుమాన్ టెంపుల్ రథం గుట్ట అర్బన్ పార్కులో అట విశాఖ వారు నిర్మించిన నూతన వాచ్ టవర్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి వాచ్ టవర్ ని ప్రారంభించారు. అనంతరం వాచ్ టవర్ ని పరిశీలించి ఆయన మాట్లాడా రు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కలం పూర్తయిన సంద ర్భంగా అడవి శాఖ వారు మణుగూరు అర్బన్ పార్క్ లో నూతనంగా నిర్మించిన వాచ్ టవర్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి నందుకు నాకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ రోజున తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం తెలంగాణ ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మహిళా సోదరీమణు లకు పెద్దపీట వేసిందని తెలంగాణ రాష్ట్రంలో 10 సంవత్సరాలు పరిపాలించిన బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు ప్రజలను ఇబ్బందులకు గురి చేసారు అని తెలియచేసారు. మరో ఏడాదిలో అద్భుతమైన అభివృద్ధి దేశం గుర్తించే విధంగా రాష్ట్ర పాలన ఉండబోతుం దని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎఫ్డిఓ సయ్యద్ మక్సుద్, మణుగూరు రేంజర్ ఉపేందర్ , అశ్వాపురం రేంజర్ సురేష్ , మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పిరినకి నవీన్, కాంగ్రేస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# 108 వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం

పినపాక, విశాలభారతి:

ఎన్నికల సమయంలో మండల ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం 108 వాహనాన్ని మంజూరు చేయించానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పినపాక మండల పరిధిలోని జానంపేట ప్రా థమిక ఆరోగ్య కేంద్రంలో 108 అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యం ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. అత్యవ సర సమయాల్లో 108 కు ఫోన్ చేసి సేవలను సద్వినియోగం చేసుకొని ప్రాణాలు కాపా డుకోవాలని తెలిపారు.మండలానికి 108 సేవలు అందుబాటులోకి రావడంతో మండల అభివృద్ధిలో మరో ముందడుగు పడిందన్నా రు. 24 గంటలు 108 సదుపాయం అందు బాటులో ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్ర మంలో తాసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, డాక్టర్ శృతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామనాథం, కాంగ్రెస్ నాయకులు పేరం వెం కటేశ్వర్లు, గంగిరెడ్డి వెంకటరెడ్డి, గంగిరెడ్డి శ్రీ నివాసరెడ్డి,సాంబ, కాంగ్రెస్ నాయకులు, కా ర్యకర్తలు,వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన

▸ వైద్యురాలు దుర్గ భవాని

పినపాక, విశాలభారతి:



మండలంలో అన్ని గ్రామాలలో కుష్టు వ్యాధి పట్ల ఇంటింటి సర్వే అవగాహన కార్యక్రమం నిర్వహించిన వైద్యురాలు దుర్గ భవాని. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టు వ్యాధి అనేది ఒక సాంక్రమిక వ్యాధి, ఇది మైకోబాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియం వల్ల కలుగుతుంది అని తెలిపారు. ఈ వ్యాధి చర్మం, నాడీ వ్యవస్థ, కళ్ళు, ముక్కు మరియు ఇతర అవయవాలను ప్రభావితం చేస్తుంది అని అన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారిని ముందుగానే గుర్తించి వైద్యం చేస్తే కుష్టి వ్యాధిని నివారించవచ్చు అని ఆమె తెలిపారు. ప్రజలందరూ ఈ సర్వేకు సహ కరించాలని ఆమె కోరారు. వ్యాధిగ్రస్తుల నుండి దూరంగా ఉండాలి అని ప్రజలకు తగిన జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్ర మంలో ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



# విద్యా ప్రమాణాల నిర్ధారణకే నేషనల్ అచీవ్ మెంట్ సర్వే


▸ ఎంఈఓ కొమరం నాగయ్య


పినపాక, విశాలభారతి:

పాఠశాల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యా లు అంచనా వేసేందుకు బుధవారం నాడు దేశవ్యాప్తంగా నేషనల్ అచీవ్ మెంట్ సర్వే జరిగింది. దీనిలో భాగంగా మండల పరిధి లోని మొత్తం నాలుగు పాఠశాలల్లో న్యాస్ పరీక్ష నిర్వహించారు ఎంపీయుపిఎస్ పోతి రెడ్డిపల్లి పాఠశాలలో ఆరో తరగతి చదువుతు న్న 9 మంది విద్యార్థులకు, మినీ గురుకులం పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న 29 మంది విద్యార్థులకు, రాధిక కాన్సెప్ట్ పాఠ శాలలో 9వ తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థులకు, భాషా హైస్కూల్లో మూడో తరగతి చదువుతున్న 50 మంది విద్యార్థులకు మరియు తొమ్మిదో తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షలను సీబీఎస్ఈ అబ్జర్వ ర్స్ మరియు ఫీల్డ్ ఇన్వెస్టిగేషన్ పాఠశాలల సిబ్బంది మరియు నాలుగు కాంప్లెక్స్ ల సీఆర్ పీ ల ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల్లో నేషనల్ అచీవ్ మెంట్ సర్వే నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి కొమరం నాగయ్య న్యాస్ పరీక్షలు జరుగుతున్న పాఠశాలలను సంద ర్శించి పరీక్ష జరుగుతున్న విధానాన్ని పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ న్యాస్ పరీక్ష ఆధారంగానే రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయనేది నిర్ధారిస్తార న్నారు. ప్రతి మూడేళ్ల కోసారి ఈ పరీక్షలను ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు.

# "కృతింగా" రెస్టారెంట్ బిర్యానీలో బొద్దింకలు ప్రత్యక్షం

ఎల్బీనగర్ విశాలభారతి:



అధికారుల అలసత్వం విధుల పట్ల నిర్లక్ష్యం నెలసరి మామూలు దావతులకు బిర్యానీ ప్యా కెట్లు ఇవన్నీ వెరసి జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారుల తీరును స్పష్టంగా కనిపిస్తుంది. తనిఖీలు చేయకపోవడం మూలంగా రెస్టా రెంట్ల యజమానులు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. ఒకప్పుడు హైదరాబాద్ బిర్యానీ అంటే బ్రాండ్ ఇమేజ్ ఉండేది. ఎక్కడి నుండైనా వచ్చి హైదరాబాదులో బిర్యాని తిని వెళితే సంతోషంగా ఉండేవారు. కానీ ఇప్పుడు హైదరాబాదులో బిర్యాని తినాలంటే జనాలు భయపడుతున్నారు. ఏహోటల్, రెస్టారెంట్ కు వెళ్లినా బిర్యానీలో బొద్దింకలు దర్శన మిస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు హై దరాబాద్ నగరంలో రోజుకొకటి వెలుగు చూస్తున్నాగాని తినేవారు మాత్రం వెనకడు గువేయడం లేదు. ఇప్పుడున్న పరిస్థితులలో బిర్యానీ బ్రాండ్ కన్న బొద్దింకలు ప్రత్యక్షం కావడంతో బిర్యానీ ప్రియులు ఖంగుతిం టున్నారు. తాజాగా బుధవారం ప్రముఖ రెస్టారెంట్ అయిన కృతింగా రెస్టారెంట్ లో బిర్యానీలో బొద్దింక ప్రత్యక్షం కావడం హాట్ టాపిక్ గా మారింది. కొత్తపేట లోని క్రితుంగా రెస్టారెంట్ లో వనస్థలిపురం కు చెందిన సందీప్ తన ముగ్గురు స్నేహితులతో కలిసి బిర్యానీ తినడానికి బుధవారం మధ్యాహ్నం రెస్టారెంట్ కు రావడం జరిగింది. కస్టమర్ బిర్యానీ ఆర్డర్ ఇవ్వగా బిర్యానీలో బొద్దింక రావడంతో ఖంగుతిన్నాడు. ఇదేమిటని మేనేజర్ సందీప్ ను ప్రశ్నించగా దురుసుగా, నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో జిహె చ్ఎంసి ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారి సన్నీకి సమాచారం అందించారు. విషయం తెలుసు కున్న సదరు అధికారి 15 నిమిషాలలో వస్తు న్నానని చెప్పి ఎంతకీ తిరిగి రాకపోవడంతో తిరిగి కస్టమర్ మళ్ళీ ఫోన్ చేశాడు. సదరు అధికారి ఫోన్ స్విచ్ ఆఫ్ లో ఉండగా చేసేది లేక ఆందోళన చేపట్టాడు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది తనిఖీలు నిర్వహించకపోవడం వలన ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని ప్రజలు చర్చించుకుం టున్నారు. గత మాసంలో అల్కాపురి లక్కీ రెస్టారెంట్ లో ఇదే సంఘటన జరిగినా అధి కారుల చర్య మాత్రం శూన్యం. ఆ రెస్టారెంట్ కిచెన్ లో ఆహార పదార్థాలు, అపరిశుభ్రంగా ఉన్న కిచెన్ గది, నాణ్యత, మార్కెట్లో పేరులేని ఆయిల్ డబ్బాలు దర్శనమిచ్చాయి. అనుని త్యం ఎదో ఒక హోటల్ లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులలో మాత్రం ఎటువంటి చలనం లేదని వాపోతున్నారు. తూతూ మంత్రంగా తనిఖీలు, కఠిన చర్యలు లేకపోవడమే ఇందుకు కారణం అని బిర్యానీ ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




## లక్ష్యానికి క్రమశిక్షణ తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చు..!

▸ అనంతగిరి జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలు

▸ వివిధ వేషధారణలతో అలరించిన విద్యార్థులు

అనంతగిరి విశాల భారతి

లక్ష్యానికి క్రమశిక్షణ తోడైతే అద్భుతాలు సృ ష్టించవచ్చు అని అనంతగిరి జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్ కే సలీం అన్నారు. బుధవారం అనంతగిరి మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినో త్సవం ఘనంగా నిర్వహించారు.. అనంతరం వివిధ హోదాల్లో వేషధారణలతో విద్యార్థులు అలరించారు. జిల్లా కలెక్టర్ గా వెన్నెల, ఎమ్మె ల్యేగా అక్షయ, డీఈవోగా సిరి, ఎమ్మార్వో గా అమృత, ఎంఈఓ గా సీమ, ప్రధానోపాధ్యా యులుగా నీల, ఉపాధ్యాయులుగా విద్యార్థు లు వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించా రు. అనంతరం వేషధారణలో విద్యార్థులు పోషించిన పాత్రలకు గాను పాఠశాల ప్రధా నోపాధ్యాయులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు... ఈ సందర్భంగా మాట్లాడు తూ... విద్యార్థులు వివిధ హోదాల్లో వేసిన వే షధారణలో అలంకరించిన పాత్రలను విద్యా ర్థులు ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ తమ లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల చైర్మన్ లింగమ్మ, ఉపాధ్యా యులు సుకన్య, కనకరావు ,బాలరాజు, లక్ష్మీ, గోవిందరెడ్డి, నాగమణి, సైదులు, కాశీం, జానకి రాములు, ఉపేంద్రమ్మ, జానిమియా, తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు అక్రిడేషన్ల జారీ ప్రక్రియ వెంటనే చేపట్టాలి

▸ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి

సూర్యాపేట, విశాల భారతి

రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ ఎలక్ట్రాన్ మీడియాలో కొనసాగుతు ఇంతవరకు అక్రిడేషన్లు పొం దనటువంటి వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియను వెంటనే చేపట్టాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసో సియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మా ట్లాడారు. అక్రిడేషన్లు పొందుకున్న వారికి రె న్యువల్ చేయడంతోనే సరిపెట్టుకోకుండా లే నివారిని దృష్టిలో పెట్టుకొని కొత్త కార్డులను జారీ చేసే ప్రక్రియ చేపట్టాలని కోరారు. ఈ విషయంలో త్వరలోనే తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలె క్టర్లకు వినతి పత్రాలు ఇచ్చేందుకు నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు పిలుపు నిచ్చా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసి యేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ దుర్గం బాలు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గట్టిగుండ్ల రాము, రాష్ట్ర సహాయ కార్యదర్శి చిలుకల చిరంజీవి, కోదాడ నియోజకవర్గ కార్యద ర్శి మాలోతు కోటి నాయక్,మోతే మండల అధ్యక్షుడు ఏర్పుల సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ భూ ప్రకంపనలు వస్తాయని ఎన్జీఆర్ఐ సూచించింది

▸ తాసిల్దార్ అద్దంకి నరేష్

పినపాక, విశాలభారతి:



ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పినపాక తాసిల్దార్ అద్దంకి నరేష్ సూచించారు. పినపాక మండలంలో పురాతన భవ నాల్లో ఉంటే వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. గోడలు పీటలు బారిన ఇళ్లలో నివసించడం క్షేమం కాదన్నారు. ప్రజలు ప్రభుత్వ సూచనలు పాటించాలని కోరారు. తాజా భూకంపంతో పినపాక ప్రజల్లో కొత్త భయం మొదలయ్యింది. ఇంతకాల కేవలం వరదలు మినహా ఇతర ఏ ప్రకృతి విపత్తు లు పినపాక లో కనిపించేవి కావన్నారు. ఇప్పుడు వచ్చింది స్వల్ప భూకంపమే కాబట్టి ఎటువంటి ఆస్తి ప్రాణ నష్టం జరగలేదన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. డ్రైవింగ్ లో వుంటే తమ వాహనాన్ని రోడ్డు పక్కన సురక్షిత ప్రాంతంలో ఆపుకోవాలి. కరెంట్ స్తంభాలు, హోర్డింగ్ లు, తాత్కాలిక నిర్మాణాలకు దూరంగా ఉదాలన్నారు.




## పాల ఉత్పత్తుల అమ్మకాలకై పార్లర్స్ ఏర్పాటు..

▸ అమ్మకాలు పెంచేందుకు కృషి..

సికింద్రాబాద్,విశాల భారతి :-

తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య లి. (విజయ తెలంగాణ డెయిరీ ) రాష్ట్రం లో పాల ఉత్పత్తుల అమ్మకాలు పెంచడానికి నూతనంగా పార్లర్స్ ను ఏర్పాటు చే స్తుందని చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి పే ర్కొన్నారు. పార్లర్స్ ద్వారా నాణ్యమైన విజయ తెలంగాణ పాలు మరియు పాల ఉత్పత్తులు ప్రజలకు మరింత చేరువావుతాయి అని, అంతేకాకుండా నిరుద్యోగులకు ఉపాది కలుగుతుందని అయిన ధీమా వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మనాల మోహన్ రెడ్డి సౌజన్యంతో, వారి అబిడ్స్ రోడ్, బషీర్ బాగ్ కార్యాలయం ప్రాం గణంలో కోపరేటివ్ యూనియన్ ఆఫీ స్,వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విజయ తెలంగాణ డెయిరీ పార్లర్ ను విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి , మేనేజింగ్ డైరెక్టర్,ఐఏఎస్ కె. చం ద్రశేఖర్ రెడ్డి, కోపరేటివ్ యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి. అన్నపూర్ణ లు కలిసి ప్రారంబించారు. ఈ కార్యక్ర మంలో విజయ డెయిరీ అధికారులు, కోపరేటివ్ యూనియన్ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో మరిన్ని పార్లర్ లను ఏర్పాటు చేయడానికి పేపర్ నోటి ఫికేషన్ ఇవ్వడం జరిగింది. రానున్న రోజుల్లో హైదరాబాదు లో నూతనంగా 50 పార్లర్ లను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. మరొక వైపు సీఎం రేవంత్ రెడ్డి సహకారాన్ని తీసుకొని విజయ డైయిరి ని విజయప థంలో నిడిపించటానికి చైర్మన్ ప్రత్యేక దృష్టి తో ముందుకు సాగుతున్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

గురువారం,
05.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా వస్పుల శ్రీకాంత్

**ఆమనగల్లు,విశాలభారతి :**

యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా వస్పుల శ్రీకాంత్ గెలుపొందిన సందర్భంగా బుధవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచాలు కాల్చి, మిఠాయిలు పంచి శ్రీకాంత్ ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులుమండ్లి రాములు, మార్కెట్ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, ఎగిరిశెట్టి సత్యం, అబ్దుల్ ఖాదర్, బాబా, దశరథం, ఖాదర్ ఖాద్రి, కరీం, ప్రసాద్, అంజత్, అశోక్, రాజ్ కుమార్, శివ, కుమార్ గౌడ్, శ్రీను, మల్లేష్, గోపాల్ పాల్గొన్నారు.



## రాష్ట్రంలోనే ఉత్తమ మార్కెట్ గా తీర్చిదిద్దాలి

- కల్వకుర్తి మార్కెట్ మిగులు నిధులు తిరిగి వచ్చేలా కృషి చేస్తా
- కల్వకుర్తి అంటే ప్రత్యేక అభిమానం.. కల్వకుర్తిని సస్యశ్యామలం చేస్తా
- మంత్రి జూపల్లి కృష్ణారావు

**కల్వకుర్తి, విశాల భారతి**

కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ ను తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ మార్కెట్ గా తీర్చిదిద్దేందుకు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఎక్సైజ్ పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన కల్వకుర్తి మార్కెట్ యార్డులో బుధవారం వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో కొంతమంది రాజకీయ నేతల వ్యవహార తీరుతో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్లో మిగులు బడ్జెట్ గా ఉన్న కోట్లాది రూపాయలను ఇతర మార్కెట్ కార్యాలయాలకు అభివృద్ధి పేరుతో తరలించడం జరిగిందని స్థానిక నేతలు పేర్కొన్నారు. ఈ క్రమంలో జూపల్లి స్పందిస్తూ కల్వకుర్తి మిగులు బడ్జెట్ డబ్బును తిరిగి కల్వకుర్తి మార్కెట్ కు తీసుకువచ్చేలా ప్రయత్నించి కల్వకుర్తి మార్కెట్లో అత్యధిక సదుపాయాలు కలిగించే ఈ ప్రాంత అన్నదాతలకు మేలు చేసేలా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని సంపూర్ణం చేయడంతో ఈ ప్రాంతంలో అత్యధిక వ్యవసాయ భూమిని సాగు భూమిగా మార్చి ఈ ప్రాంత రైతన్నలకు మేలు చేసేలా కృషి చేస్తానన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం అంటే తనకు ప్రత్యేక అభిమానం అని.. గతంలోనూ తాను మంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాంత అభివృద్ధి కోసం తనవంతు ప్రయత్నం చేసినట్లు జూపల్లి అన్నారు. భవిష్యత్తులోనూ మంత్రిగా ఈ ప్రాంత ప్రజలు ప్రత్యేకంగా రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. రైతు భరోసా పై మాట్లాడే అర్హత కేసిఆర్, కేటీఆర్, హరీష్ లకు లేదని.. బిఆర్ ఎస్ ప్రభుత్వం మూడు వేల కోట్ల రూపాయల రైతు భరోసా అందించిందని కాంగ్రెస్ ప్రభుత్వం 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసిందని రుణమాఫీ చేయకుంటే వారిచ్చిన రైతు భరోసా ప్రభుత్వానికి ఓ లెక్క కాదని మంత్రి చెప్పారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా అందిస్తామని ఆయన ప్రకటించారు. నూతన పాలకవర్గం కరీంనగర్ జిల్లా ముల్కనూర్ మార్కెట్ సొసైటీని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆయన సూచించారు. గత ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని తాము ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల లోపు ప్రతి రైతుకు రుణమాఫీ చేయడమే కాకుండా పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు బోనస్ అందిస్తున్నామని ఆయన చెప్పారు. రైతులు ఆధునిక వ్యవసాయం పై అవగాహన పెంచుకొని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందాలని మంత్రి సూచించారు. ప్రజా పాలనకు పాతర వేసిన బిఆర్ఎస్, కొన్ని పత్రికలు ప్రభుత్వం పై విషం కక్కుతూ అసత్య ప్రచారం చేస్తున్నాయని వాటిని పార్టీ శ్రేణులు తిప్పి కొట్టాలని మంత్రి పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం పనిచేసే పదవులకు వన్నె తీసుకురావాలని ఆయన సూచించారు. అంతకుముందు మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గా వావిల్లా మనీల సంజీవ్ యాదవ్ వైస్ చైర్మన్ పండితరావు, డైరెక్టర్ల చే మార్కెటింగ్ అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సురక్ష బీమాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎపిజిబివి మేనేజర్ తిరుపతి

**ఆమనగల్లు, విశాల భారతి :**



సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ మేనేజర్ తిరుపతి అన్నారు. భారత ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని మంగళపల్లి, గౌరీపల్లి గ్రామంలో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం భాగంగా ప్రజలకు అవగాహన నిర్వహించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. సంవత్సరానికి రూ. 20 చెల్లించి ఏడాదికి రెండు లక్షల ప్రమాద బీమా పొందడానికి అవకాశం వుందన్నారు. 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వరకు అర్హులు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన 436 సంవత్సరానికి రూ. 436 చెల్లించి రెండు లక్షల జీవిత బీమా పొందవచ్చని తెలిపారు. 18 నుండి 50 సంవత్సరాల వారు అర్హులు ఫిషింగ్ కాల్స్ ద్వారా సేవింగ్ కాల్స్ ద్వారా ఆన్లైన్ ద్వారా జరిగే ఫ్రాడ్స్ పై అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి ఎలాంటి ఓటీపీలు సివివి నెంబర్లు అడిగే అవకాశం ఉండదని సూచించారు. ఎలాంటి ఫోన్ కాల్స్ వచ్చిన వెంటనే 1930 కి కాల్ చేసి తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

**సైబర్ మోసలపై వీడ్స్ కౌన్సిలర్స్ అవగాహనా**

ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. ప్రతిఒక్కరూ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్‌లో ఎవరైనా బ్యాంకు ఖాతాల వివరాలు లేదా ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దన్నారు. అదే విధంగా ఫోన్ లేదా మెయిల్ ద్వారా వచ్చే వెబ్‌సైట్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు మన ఫోన్లు, కంప్యూటర్లు హ్యాక్ చేసి డాటా మొత్తం సేకరిస్తారన్నారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని భావిస్తూ ఎన్జిఓ, వీడ్స్ ఆధ్వర్యంలో ఎస్బిఐ సహకారంతో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కౌన్సిలర్లు ఊరడి మహేష్, వి జగదీశ్ తెలిపారు. అందులో భాగంగా మంగళపల్లి గ్రామం లో సైబర్ ఆర్థిక అవగాహన నిర్వహించమన్నారు.



## జర్నలిస్ట్ రాజు మృతి పట్ల నివాళులర్పించిన జర్నలిస్టులు

**సూర్యాపేట, విశాల భారతి**

సూర్యాపేటకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ తాళ్లపల్లి రాజు (కేబుల్ టీవీ రాజు) ఇటీవల మరణించారు. రాజు దశదిన కార్యక్రమం బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్సార్ ఎన్ ఫంక్షన్ హాల్లో జరిగిన సందర్భంగా దశదిన కార్యక్రమానికి పలువురు జర్నలిస్టు హాజరై రాజు చిత్రపటానికి పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించినారు. ఈ సందర్భంగా సూర్యాపేట జర్నలిస్టులు డాక్టర్ కృష్ణ బంటు, ఐయితబోయిన రాంబాబు, పెద్దింటి శ్యామ్ సుందర్ రెడ్డి, అమర గాని నాగేందర్, పల్లె మణి బాబు, తండు వెంకన్న, జహీర్, రాంబాబు, శ్రీనివాస్ తో పాటు పలువురు విలేకరులు, నాయకుల ద్వారా వచ్చిన ఆర్థిక సహాయాన్ని రాజు కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది.

## రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా క్యామ రాజేష్

**అమనగల్లు,విశాలభారతి :**

గత ఆగస్టు నెలలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తెలంగాణలో నిర్వహించిన ఆన్ లైన్ ఓటింగ్ ఎన్నికలలో భాగంగా రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఓపెన్ క్యాటగిరిలో కడ్తాల్ మండలానికి చెందిన క్యామ రాజేష్ ఎన్నికవ్వడం జరిగింది. ఈ సందర్భంగా క్యామ రాజేష్ మాట్లాడుతూ పార్టీ కోసం, పార్టీ బలోపేతం కోసం యువతీ యువకుల సమస్యలపై కృషి చేస్తానని అన్నారు. అలాగే ప్రభుత్వ పరంగా కూడా అన్ని వర్గాల ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా తనకు ఓట్లు వేసి ఓపెన్ క్యాటగిరిలో గెలిపించిన యూత్ మిత్రులకు అలాగే సహకరించిన యూత్ కాంగ్రెస్ అభ్యర్థులకు మరియు నాయకులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనకు వ్యతిరేకంగా...

- ఎం జె ఆర్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

**కల్వకుర్తి విశాలభారతి**



తెలంగాణ ప్రజలకు ఎన్నికల్లో మోసపూరిత హామీలను ఇచ్చి, మాయ మాటలు చెప్పి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ సీఎం హామీలను అమలు చేయకుండా ఏడాది పూర్తి అయిందని సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఇచ్చిన 6 గ్యారంటీలను అమరుపరిచి ఆ తర్వాత సంబరాలు చేసుకోవాలని బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి హితవు పలికారు. ఇచ్చిన ఆరు హామీల్లో ఉచిత బస్సు అని చెప్పుకుంటూ ఈరోజు ఆ బస్సులు కూడా తిరగలేని పరిస్థితిలో బస్సుల పరిమితులను తగ్గించి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం దాటిపోతున్న ఏ హామీలను సక్రమంగా నెరవేర్చకుండా సంబరాలు చేసుకోవడం హాస్యస్పదం, సిగ్గుచేటని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజానీకానికి క్షమాపణలు చెప్పి వెంటనే రెండు లక్షల రుణమాఫీ, రైతు బంధు, మహిళలకు రూ.2500, కళ్యాణ లక్ష్మి, తులం బంగారం, నిరుద్యోగ భృతి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ప్రతి గ్రామానికి.. ప్రతి తండాకు బీటీ రోడ్లు వంటి హామీలను వెంటనే నెరవేర్చాలని, లేనియెడల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి హెచ్చరించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పై వ్యతిరేకత రావడంతో మళ్లీ ప్రజలను మాయ మాటలు చెప్పి సంక్రాంతికి రైతుబంధు వేస్తున్నామని చెప్పి పంచాయతీ ఎన్నికలకు సిద్ధం అవుతున్నారని.. ప్రజలు ఇట్టి విషయాన్ని దృష్టిలో ఉంచుకొని వచ్చే పంచాయతీ ఎన్నికల్లో, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన సూచించారు. అనంతరం జడ్చర్ల పట్టణ కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ఊరుకొండ గేటు నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తూ ఊరుకొండ గ్రామం, ముచ్చర్లపల్లి గ్రామం మీదుగా జడ్చర్లకు తరలి వెళ్లారు.



## ప్రజాపాలన విజయోత్సవ సంబరాల్లో పాల్గొన ముత్యాలు

- సిఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం

**బాల్కొండ,విశాలభారతి**

ప్రజాపాలన విజయోత్సవ సంబరాల్లో బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పాల్గొన్నారు. బుధవారం భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సంవత్సరకాలంలో ప్రజా ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు.గత ప్రభుత్వం రూ. 7లక్షల కోట్ల అప్పులు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని నిలువునా ముంచిందని అన్నారు. నూతన ప్రజా ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక వ్యవస్థని మెరుగుపరుస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని అన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ప్రకారం 2లక్షల రుణమాఫీ చేశామని ఇంకా మిగిలిన రెండు లక్షల పైచిలుకు రుణాలను ప్రజా ప్రభుత్వం త్వరలోనే మాఫీ చేస్తుందని తెలిపారు.వరి పంటకు 500 బోనస్,ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించిందని అన్నారు.అలాగే 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్,500కే గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేసి సిఎం రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదిలోనే ముచ్కూర్ గ్రామానికి దాదాపు 65 లక్షల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించామని,ముచ్కూర్ గ్రామ మహిళల కోరిక మేరకు బతుకమ్మ ఘాటును నిర్మించామని అన్నారు.రానున్న నాలుగేళ్లలో ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని అన్నారు. అనంతరం సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు.





## పాలకవర్గం సభ్యులు రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- అట్టహాసంగా ఆమనగల్లు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం

**ఆమనగల్లు, విశాలభారతి :**



పాలకవర్గం సభ్యులు రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని రాష్ట్ర ఎక్సైజ్ పర్యటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. బుధవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. స్థానిక శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్లో రాష్ట్ర ఎక్సైజ్ పర్యటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, సిడబ్ల్యూసి చల్లా వంశీ చంద్ రెడ్డి సమక్షంలో చైర్మన్ గాయాట గీతనర్సింహా, వైస్ చైర్మన్‌గా గూడూరు భాస్కర్ రెడ్డి తోపాటు పలువురు డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో మార్కెట్ కమిటీలు అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నాయని చెప్పారు. రైతుల సంక్షేమం అజెండాగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, రైతులకు ఏ కష్టం వచ్చినా పార్టీలకతీతంగా అక్కున చేర్చుకొని పనిచేయాలని, వచ్చిన పదవికి మంచి పేరు తెచ్చుకోవాలని మంత్రి సూచించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంగా ప్రమాణం చేసిన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధికి కొత్త కార్యవర్గం పాటు పడాలన్నారు. ప్రమాణస్వీకారం అనంతరం కమిటీ చైర్మన్ యాట గీత రిజిస్టర్‌లో సంతకాలు చేసి బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ యాట గీతనర్సింహా మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామని, రైతులకు సేవలందించేందుకు తమ కమిటీ నిరంతరం శ్రమిస్తుందన్నారు. అందుకు నాయకులు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
05.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily



## శబరి బయిలు దేరిన రాయినిగూడెం అయ్యప్ప స్వామి మాలాధారుల బృందం

**సూర్యాపేట, విశాలభారతి**

సూర్యాపేట అయ్యప్ప స్వామి దేవాలయంలో రాచకొండ దేవయా గురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం రాయినిగూడెం అయ్యప్ప స్వామి మాల ధారుల బృందం ఇరుముడి కట్టుకొని 41 రోజులు స్వామి నియమ నిష్ఠలతో దీక్ష చేసిన అయ్యప్ప బృందం శబరిమలకు బయలుదేరినారు. శబరిమలకు వెళ్లిన వారిలో వెలగబోయిన మధు స్వామి, ఎడ్ల వెంకన్న,బాలరాజు, ఎల్లయ్య, ప్రకాష్, స్వామి, కోళ్ల వెంకటరమణ స్వామి, స్వాముల బృందం ఉన్నారు.





## బెల్టు షాపులను రద్దు చేయాలని, డ్రగ్స్ ను అరికట్టాలని ధర్నా

- పి వై ఎల్, పి ఓ డబ్ల్యు

**సూర్యాపేట, విశాల భారతి**

పల్లెల్లో ఎక్కడ చూసినా బెల్టు షాపులతో కిక్కు ఫుల్ గా కనిపిస్తోందని, ఏ గ్రామంలో చూసినా, ఏ తండాల్లో చూసినా బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని ప్రగతిశీల యువజన సంఘం (పి వై ఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రవి, ప్రగతిశీల మహిళా సంఘం (పి ఓ డబ్ల్యు) జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సక్క అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయం ముందు పిఓడబ్ల్యు, పివైఎల్ ఆధ్వర్యంలో బెల్ట్ షాపుల రద్దు చేయాలని, గంజాయి, కొకైన్, హెరాయిన్ తదితర మత్తు పదార్థాలను అరికట్టాలని ధర్నా నిర్వహించడం జరిగింది. ఎక్సైజ్ ఎస్సై కు వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా డి. రవి, నర్సక్క పాల్గొని మాట్లాడుతూ గ్రామాలలో బెల్ట్ షాపులు అనుమతులు లేకుండా విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని, తనిఖీలు చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు ముడుపులు తీసుకుని మౌనంగా ఉంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. గ్రామాలలో బెల్ట్ షాపుల మూలంగా వయసుతో సంబంధం లేకుండా యువత మద్యానికి బానిసలవుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత మద్యానికి బానిసై నేరస్తులుగా మారి పలు కేసుల్లో చిక్కుకుంటున్నారని తెలిపారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న కన్నెత్తి ఎక్సైజ్ శాఖ అధికారులు చూడకపోవడంతో అంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారని సమాచారం తెలిపిన తూతూ మంత్రంగా తనిఖీలు చేపడుతూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. పల్లె ప్రాంతాల్లో తండాల్లో ఎక్కడ చూసినా పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపుల నిర్వహణ చేపడుతూ ధనార్జనే ధ్యేయంగా నిర్వాహకులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బెల్ట్ షాపుల నిర్వాహకులు క్వార్టర్ పై రూ.30 నుంచి రూ.50, బీర్ల పై రూ.40 నుంచి రూ.60 వరకు అధికంగా వసూలు చేస్తూ దండుకుంటున్నారని అన్నారు. అబ్కారీ శాఖ అధికారులు బెల్టు దుకాణాల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించి పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్టు షాపుల పై కఠిన చర్యలు తీసుకోవాలని యువత, ప్రజలు మద్యానికి బానిస కాకుండా అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లైసెన్స్ కలిగిన వైన్స్ షాపుల్లో లభించని వివిధ రకాల బ్రాండ్ల మద్యం బెల్టు దుకాణాలలో దర్శనమిస్తుందని వాపోయారు. దండు మైసమ్మ దేవాలయం పరిధిలో రోడ్డుపై ఇరువైపులా ఉన్నటువంటి రెండు వైన్ షాపులను వెంటనే రద్దు చేయాలని వారి డిమాండ్ చేశారు దాని మూలంగా ప్రజలు మహిళలు భయాందోళనకు గురవుతున్నారని వారన్నారు. జాతీయ రహదారుల వెంబడి విద్యాసంస్థల పక్కన, గుడుల ప్రక్కన ఉన్నటువంటి వైన్ షాపులను తొలగించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి రవాణా విచ్చలవిడిగా కొనసాగుతుందని గంజాయి నివారించడంలో ఎక్సేంజ్ పోలీస్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారా అన్నారు. రోజు పేపర్లలో గంజాయి సప్లై చేస్తున్నా వారి పై కేసుల నమోదు చేస్తున్నామని చెప్తున్నారు తప్ప కఠినమైన చర్యలు తీసుకోవడం లేదని వారు అన్నారు. రాష్ట్ర సరిహద్దులలో తనిఖీలు నామమాత్రంగా మాత్రమే చేస్తున్నారని దాని మూలంగా గ్రామ స్థాయి వరకు గంజాయి మహమ్మారి వచ్చి చేరిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భయాందోళన గురి చేస్తున్న గంజాయిలను పూర్తిగా నిషేధించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమంలో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు జిల్లా సహాయ కార్యదర్శి రామలింగమ్మ ,జిల్లా కోశాధికారి కావ్య, జిల్లా కమిటీ సభ్యులు సైదమ్మ, మంగమ్మ, జయసుధ, సామ ఉపేంద్ర, పి వై ఎల్ నాయకులు వీరబోయిన లింగయ్య, దండి ప్రవీణ్, పెద్దింటి అశోక్ రెడ్డి, పిడిఎస్ యు డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్ పాల్గొన్నారు.





## ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన బీఆర్ఎస్

- రీజినల్ రింగ్ రోడ్ అమ్మి రైతు భరోసా అందించిన ఘనత వారిదే
- రైతు భరోసా పై మాట్లాడే అర్హత కెసిఆర్, కేటీఆర్ కు లేదు
- రైతు సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యం
- మంత్రి జూపల్లి

**ఆమనగల్లు, విశాల భారతి ::**

రైతు భరోసా పై మాట్లాడే అర్హత కేసీఆర్, కేటీఆర్, హరీష్ లకు లేదని ఎన్నికల ముందు ఓట్ల కోసం ప్రభుత్వానికి ఆదాయాన్నిచ్చే రీజినల్ రింగ్ రోడ్డు అమ్మి రైతు భరోసా ఇచ్చిన ఘనత బిఆర్ఎస్ దేనని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. బుధవారం ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలంగాణ ధనిక రాష్ట్ర అన్న కేసీఆర్ 64 ఏళ్ల రాష్ట్ర పాలనలో గత పాలకులు 70 వేల కోట్ల అప్పులు చేస్తే బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో 7 లక్షల కోట్ల అప్పులు ఎందుకు చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం మూడు వేల కోట్ల రూపాయల రైతు భరోసా అందించిందని కాంగ్రెస్ ప్రభుత్వం 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసిందని రుణమాఫీ చేయకుంటే వారిచ్చిన రైతు భరోసా ప్రభుత్వానికి ఓ లెక్క కాదని మంత్రి చెప్పారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా అందిస్తామని ఆయన ప్రకటించారు. వారి పాలనలో పంట నష్టపరిహారం అందించలేదని కాంగ్రెస్ ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు పదివేల రూపాయలు అందివ్వడమే కాక పంటల భీమా కోసం 1300 కోట్లు కేటాయించినట్లు వివరించారు. కే ఎల్ ఐ కి లక్షల కోట్లు ఖర్చు చేసి ఎందుకు పూర్తి చేయలేదని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు 70 లక్షల కేటాయించినట్లు ప్రకటించి ఒక రూపాయి ఎందుకు కేటాయించలేదని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ చేసిన అప్పుల పాపానికి ఏడాదికి 6500 కోట్లు వడ్డీ, విద్యుత్ బకాయిలు 1000 కోట్లకు వడ్డీ చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. నూతన పాలకవర్గం కరీంనగర్ జిల్లా ముల్కనూర్ మార్కెట్ సొసైటీని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆయన సూచించారు. దేశానికి ఆదర్శంగా నిలిచి ప్రతి రైతు అవసరాలను తీర్చే సొసైటీగా మంచి గుర్తింపు తీసుకువచ్చిందని ఆయన వివరించారు. గత ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని తాము ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల లోపు ప్రతి రైతుకు రుణమాఫీ చేయడమే కాకుండా పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు బోనస్ అందిస్తున్నామని ఆయన చెప్పారు. రైతులు ఆధునిక వ్యవసాయంపై అవగాహన పెంచుకొని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందాలని మంత్రి సూచించారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం ముఖ్యం కాదని ప్రజా సంక్షేమమే ముఖ్యమని ప్రధాని పదవిని సైతం త్యాగం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు.ప్రజా పాలనకు పాతర వేసిన బిఆర్ఎస్, కొన్ని పత్రికలు ప్రభుత్వం పై విషం కక్కుతూ అసత్య ప్రచారం చేస్తున్నాయని వాటిని పార్టీ శ్రేణులు తిప్పి కొట్టాలని మంత్రి పిలుపు నిచ్చారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే వారికి తగిన సమయంలో పదవులు అవకాశాలు గుర్తింపు కచ్చితంగా వస్తుందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీకి సేవ చేసిన గీతా నరసింహ సేవలను గుర్తించి వారికి మార్కెట్ కమిటీ చైర్మన్ గా అవకాశం కల్పించారని ఆయన వివరించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం పనిచేసే పదవులకు వన్నె తీసుకురావాలని ఆయన సూచించారు. కే ఎల్ ఐ డి 82 కాలువ ద్వారా వచ్చే పంట నాటికి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ఆయన చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి పంచాయతీరాజ్ ద్వారా త్వరలో ప్రభుత్వం 300 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో టూరిజం అభివృద్ధికి 30 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ రాజేష్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి వంశీ చందర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు అవకాశాలు వస్తాయని, ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలు, రైతుల సంక్షేమం కోసం పనిచేసే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. అనంతరం మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గా యాట గీతా నరసింహ, వైస్ చైర్మన్, డైరెక్టర్ల చే జిల్లా మార్కెటింగ్ అధికారి ఎండి రియాజ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీనిర్వహించారు.కార్యక్రమంలో కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి,పిసిసి సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ అధ్యక్షులు యాట నర్సింహా, మండలాల అధ్యక్షులు జగన్, బిచ్య, ప్రభాకర్ రెడ్డి,మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు రైతులు పాల్గొన్నారు.

**బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కాంగ్రెస్ లో చేరిక**

**రంగారెడ్డి జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు కండె సాయి మంత్రి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పకున్నారు. రేవంత్ రెడ్డి ఏడాది పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ లో చేరినట్లు ఆయన తెలిపారు.**



## ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా యాటగీతా నర్సింహా

**ఆమనగల్లు, విశాల భారతి :**

ఆమనగల్లు మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా యాటగీతా నర్సింహా బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన ఎన్నికకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, సిడబ్ల్యూసి చల్లా వంశీచంద్ రెడ్డి తో పాటు ప్రతి ఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుకొంటున్నట్లు పేర్కొన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. మార్కెట్ అభివృద్ధికి నిరంతరం కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతు సమస్యలను ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు చర్చించి పరిష్కరించేందుకు పాటుపడతానన్నారు. మార్కెట్ అభివృద్ధికి రైతులు, పాలకవర్గం, ప్రజాప్రతినిధులు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. అనంతరం చైర్మన్ ను పాలకవర్గంతో పాటుగా అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు.




## ఐసీఎంలో చట్టబద్ధమైన, పక్షిక న్యాయపరమైన విధులపై సదస్సు..

**చిగురుమామిడి (విశాల భారతి):**

ఐసిఎం,భారత ప్రభుత్వం ఆవరణలో జరిగిన ఒకరోజు సదస్సులో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సహకార జిల్లా అధికారులు,జిల్లా సహకార ఆడిట్ ఆఫీసర్స్ హాజరైనట్లు డాక్టర్ ఎస్ఎల్ఎన్ టి, వర్క్ షాప్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు.దీప ప్రజ్వలన చేయడం ద్వారా ఈ కార్యక్రమాన్ని హైకోర్టు సీనియర్ అడ్వకేట్ రాజేశ్వరరావు ప్రారంభించినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు.ఈ ఒకరోజు రాష్ట్రస్థాయి సదస్సుని సహకార శాఖ ఆదేశాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నట్లు డాక్టర్ గణేషన్ ఐసిఎం డైరెక్టర్ చెప్పడం జరిగినదాన్నారు .ఈ రాష్ట్ర సదస్సులో బి.ఎస్ తా జ్ జీవన్ కుమార్ కోఆపరేటివ్ ట్రిబ్యునల్ జిల్లా న్యాయమూర్తి రిటైర్డ్ రాజేశ్వర రావు సీనియర్ న్యాయవాది తెలంగాణ హైకోర్టు,ఎమ్వెం. కట్ దివాకర్ సీనియర్ న్యాయవాది తెలంగాణ హైకోర్టు వక్తలుగా హాజరైనట్లు తెలిపారు.లీగల్ శిక్షణలు, ప్రత్యేక లీగల్ సెల్స్, రికార్డులను బలోపేతం చేయడం,డాక్యుమెంటేషన్, సమయపాలనకు కట్టుబడి ఉండటం,ఆవర్తన సమీక్ష మరియు జవాబుదారీ విధానం వంటి అంశాలు పటిష్టవంతం చేయలని వక్తలు సూచించారు. డాక్టర్ శ్రీనివాస్ వర్క్ షాప్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టుకి సంబంధించిన న్యాయవాదులు, రిటైర్డ్ జడ్జెస్ పాల్గొన్నారని, సహకార చట్ట పరమైన, న్యాయపరమైన వివిధ కీలక అంశాల పై సమగ్రమైన చర్చలు జరిగినట్లు,అధికారులు అడిగిన క్షేత్ర స్థాయిలో ఉన్న,ఎదురవుతున్న సమస్యల పై న్యాయ పరమైన పరిష్కార మార్గాలను న్యాయవాదులు వివరించడం జరిగిందని డాక్టర్ యస్.ఎల్.ఎన్.టి శ్రీనివాస్ చెప్పారు.ముగింపు కార్యక్రమంలో శ్రీ జి శ్రీనివాసరావు అడిషనల్ రిజిస్టర్ ఆఫ్ కోపరేటివ్ సొసైటీస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ముఖ్యఅతిథి కీలోకోపన్యాసం చేస్తూ సహకార సంఘముల పటిష్టతలో సుపరిపాలన జవాబుదారీతనం కీలకమని మరీ ముఖ్యంగా చట్టబద్ధమైన మరియు పాక్షిక న్యాయపరమైన విధుల్లో పూర్తి అవగాహన అధికారుల సమర్థత చాలా కీలకమని చెప్పడం జరిగినదన్నారు.



## షాట్ సర్క్యూట్ కి గురైన ఇళ్లను పరిశీలించిన ముత్యాల సునీల్ కుమార్

**బాల్కొండ,విశాలభారతి**

మెండోర మండల కేంద్రంలో తాకాల సాయన్న,గుండేటి శ్రీనివాస్,గొల్ల దేవమల్లు,గొల్ల దేవేందర్ కు చెందిన నాలుగు కుటుంబాలు నివసించే ఒక ఇల్లు ప్రమాదవశాత్తు షాట్ సర్క్యూట్ కు గురై పూర్తిగా దగ్ధమైంది.కట్టు బట్టలతో సహా వారి కుటుంబాలకు సంబంధించిన దాదాపు 10లక్షల రూపాయల వరకు డబ్బులు కూడా కాలిపోయాయి.ఈ విషయాన్ని తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ వారి ఇంటిని పరిశీలించి,వారందరినీ ఓదార్చి ధైర్యాన్ని కల్పించారు. బాధపడవద్దని తెలిపి వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.ప్రభుత్వం తరుపున వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలిపారు. ఒక్కో కుటుంబానికి 10వేల ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

